# సుమతీ శతకము

## బద్దెన భూపాలుడు

*శ్రీ రాముని దయచేతను*
*నారూఢిగ సకల జనులు నౌరా యనగా*
*ధారాళమైన నీతులు*
*నోరూరగఁ జవులు పుట్ట నుడివెద సుమతీ* 1

*అక్కఱకు రాని చుట్టము,*
*మ్రొక్కిన వరమీని వేల్పు, మోహరమునఁ దా*
*నెక్కిన బాఱని గుఱ్ఱము*
*గ్రక్కున విడవంగవలయుఁ గదరా సుమతీ* 2

*అడిగిన జీతంబియ్యని*
*మిడిమేలపు దొరను గొల్చి మిడుకుట కంటెన్*
*వడిగల యెద్దులఁ గట్టుక*
*మడి దున్నుక బ్రతుక వచ్చు మహిలో సుమతీ* 3

*అడియాస కొలువుఁ గొలువకు,*
*గుడి మణియము సేయఁబోకు, కుజనుల తోడన్*
*విడువక కూరిమి సేయకు,*
*మడవిని దోడరకొంటి నరుగకు సుమతీ* 4

*అధరము గదలియు, గదలక*
*మధురములగు భాష లుడుగి మౌన వ్రతుఁడౌ*
*అధికార రోగ పూరిత*
*బధిరాంధక శవముఁ జూడ బాపము సుమతీ* 5

*అప్పు కొని చేయు విభవము,*
*ముప్పున బృఆయంపుటాలు, మూర్ఖుని తపమున్,*
*దప్పరయని నృపు రాజ్యము*
*దెప్పరమై మీఁదఁ గీడు దెచ్చుర సుమతీ* 6

*అప్పిచ్చువాఁడు, వైద్యుడు,*
*నెప్పుడు నెడతెగక పాఱు నేఱును, ద్విజుఁడున్*
*జొప్పడిన యూర నుండుము*
*చొప్పడకున్నట్టి యూరు సొఱకుము సుమతీ* 7

అల్లుని మంచితనంబు,
గొల్లని సాహిత్య విద్య, కోమలి నిజమున్,
బొల్లున దంచిన బియ్యము,
దెల్లని కాకులును లేవు తెలియుము సుమతీ 8

ఆఁకొన్న కూడె యమృతము,
తాఁకొంచక నిచ్చువాఁడె దాత ధరిత్రిన్,
సోఁకోర్చువాఁడె మనుజుఁడు,
తేఁకువ గలవాఁడె వంశ తిలకుఁడు సుమతీ 9

ఆఁకలి యుడుగని కడుపును,
వేఁకటియగు లంజ పడుపు విడువని బ్రతుకున్,
బ్రాఁకొన్న నూతి యుదకము,
మేఁకల పాడియును రోఁత మేదిని సుమతీ 10

ఇచ్చునదే విద్య, రణమున
జొచ్చునదే మగతనంబు, సుకవీశ్వరులున్
మెచ్చునదే నేర్పు, వదుకు
వచ్చునదే కీడు సుమ్ము వసుధను సుమతీ 11

ఇమ్ముగ జదువని నోరును,
నమ్మా యని బిలిచి యన్న మడుగని నోరున్,
దమ్ముల బిలువని నోరును
గుమ్మరి మను ద్రవ్వినట్టి గుంటర సుమతీ 12

ఉడుముండదె నూరేండ్లును,
బడియుండదె పేర్మిఁ బాము పదినూరేండ్లున్,
మడువునఁ గొక్కెర యుండదె,
కడు నిలఁ బురుషార్థ పరుఁడు గావలె సుమతీ 13

ఉత్తమగుణములు నీచున
కెత్తెఱగున గలుగ నేర్చు; నెయ్యెడలం దా
నెత్తిచ్చి కరఁగి పోసిన
నిత్తడి బంగారమగునె యిలలో సుమతీ 14

ఉదకము ద్రావెడు హయమును,
మదమున నుప్పొంగుచుండు మత్తేభంబున్,
మొదవు కడ నున్న వృషభము,
జదువని యానీచుఁ గడకు జనకుర సుమతీ 15

ఉపకారికి నుపకారము
విపరీతము గాదు సేయ వివరింపంగా;
నపకారికి నుపకారము
నెపమెన్నక సేయువాఁడు నేర్పరి సుమతీ 16

ఉపమింప మొదలు తియ్యన
కపటం బెడనెడను జెఱకు కైవడినే పో
నెపములు వెదకును గడపట
గపటపు దుర్జాతి పొందు గదరా సుమతీ 17

ఎప్పటి కెయ్యది ప్రస్తుత
మప్పటికా మాటలాడి, యన్యుల మనముల్
నొప్పించక, తా నొవ్వక,
తప్పించుక తిరుగువాఁడు ధన్యుడు సుమతీ 18

ఎప్పుడు దప్పులు వెదకెడు
నప్పురుషుని గొల్వఁగూడ దది యెట్లన్నన్
సర్పంబు పడగ నీడను
గప్ప వసించిన విధంబు గదరా సుమతీ 19

ఎప్పుడు సంపద కలిగిన
నప్పుడు బంధువులు వత్తు రది యెట్లన్నన్
తెప్పలుఁగ జెఱువు నిండిన
గప్పలు పదివేలు చేరుఁ గదరా సుమతీ 20

ఏఱకుమీ కసుగాయలు,
దూఱకుమీ బంధుజనుల దోషము సుమ్మీ,
పాఱకుమీ రణమందున,
మీఱకుమీ గురువు నాజ్ఞ మేదిని సుమతీ 21

ఒక యూరికి నొక కరణము,
నొక తీర్పరియైనఁ గాక, నొగిఁ దఱుచైనన్,
గకవికలు గాక యుండునె
సకలంబును గొట్టువడక సహజము సుమతీ 22

ఒరు నాత్మఁ దలఁచు సతి విడు,
మఱుమాటలు పలుకు సతుల మన్నింపకుమీ,
వెఱ పెఱుగని భటునేలకు,
తఱచుగ సతి గవయఁ బోకు, తగదుర సుమతీ 23

ఒల్లని సతి నొల్లని పతి,
నొల్లని చెలికాని విడువ నొల్లని వాఁడే
గొల్లండు, కాక ధరలో
గొల్లండును గొల్లడౌనె గుణమున సుమతీ 24

ఒడల బండ్లును వచ్చును,
ఒడలు నాబండ్లమీఁద నొప్పుగ వచ్చున్,
ఒడలు బండ్లును వలనే
వాడంబడు గలిమి లేమి వసుధను సుమతీ 25

కడు బలవంతుఁడైనను
బుడమిని బ్రాయంపుటాలిఁ బుట్టిన యింటన్
దడవుండ నిచ్చెనేనియుఁ
బడుపుగ నంగడికిఁ దానె బంపుట సుమతీ 26

కనకపు సింహాసనమున
శునకముఁ గూర్చుండబెట్టి శుభ లగ్నమునం
దొనరగఁ బట్టముఁ గట్టిన
వెనుకటి గుణమేల మాను వినరా సుమతీ 27

కప్పకు నొరగాలైనను,
సర్పమునకు రోగమైన, సతి తులువైనన్,
ముప్పున దరిద్రుఁడైనను,
తప్పదు మఱి దుఃఖ మగుట తథ్యము సుమతీ 28

కమలములు నీటఁ బాసిన
కమలాప్తుని రశ్మి సోకి కమలిన భంగిన్
తమ తమ నెలవులు దప్పిన
తమ మిత్రులు శత్రులౌట తథ్యము సుమతీ 29

కరణముఁ గరణము నమ్మిన
మరణాంతక మౌను గాని మనలేడు సుమీ;
కరణము దన సరి కరణము
మఱి నమ్మక మర్మ మీక మనవలె సుమతీ 30

కరణముల ననుసరింపక
విరసంబునఁ దిన్న తిండి వికటించు జుమీ
యిరుసునఁ గందెనఁ బెట్టక
పరమేశ్వరు బండి యైనఁ బారదు సుమతీ 31

కరణము సాదైయున్నను,
గరి మద ముడిగినను, బాము గఱవక యున్నన్,
ధరఁ దేలు మీటకున్నను,
గర మరుదుగ లెక్క గొనరు గదరా సుమతీ 32

కసుగాయ గఱచి చూచిన
మసలక పస యొగరు రాక మధురంబగునా;
పస గలుగు యువతులుండగ
పసి బాలలఁ బొందువాఁడు పశువుర సుమతీ 33

కవి కాని వాని వ్రాతయు,
నవరస భావములు లేని నాతుల వలపున్,
దవిలి చను పంది నేయని
వివిధాయుధ కౌశలంబు వృధరా సుమతీ 34

కాదు సుమీ దుస్సంగతి,
పోదుసుమీ "కీర్తి" కాంత పొందిన పిదపన్,
వాదు సుమీ యప్పిచ్చుట,
లేదు సుమీ సతుల వలపు లేశము సుమతీ 35

కాముకుఁడు దనిసి విడిచిన
కోమలిఁ బరవిటుఁడు గవయ గోరుట యెల్లన్
ప్రేమమునఁ జెఱకు పిప్పికి
చీమలు వెస మూగినట్లు సిద్ధము సుమతీ 36

కారణము లేని నగవును,
బేరణము లేని లేమ, పృథివీ స్థలిలోఁ
బూరణము లేని బూరెయు,
వీరణము లేని పెండ్లి వృధరా సుమతీ 37

కులకాంత తోడ నెప్పుడు
గలహింపకు, వట్టి తప్పు ఘటియింపకుమీ,
కలకంఠి కంట కన్నీ
రొలికిన సిరి యింట నుండ నొల్లదు సుమతీ 38

కూరిమి గల దినములలో
నేరము లెన్నఁడును గలుగ నేరవు మఱి యా
కూరిమి విరసంబైనను
నేరములే తోఁచు చుండు నిక్కము సుమతీ 39

కొంచెపు నరు సంగతిచే
నంచితముగఁ గీడు వచ్చు నది యెట్లన్నన్
గించిత్తు నల్లి కుట్టిన
మంచమునకుఁ జేటు వచ్చు మహిలో సుమతీ 40

కొక్కోకమెల్లఁ జదివిన,
చక్కనివాఁడైన, రాజ చంద్రుండైనన్,
మిక్కిలి రొక్కము లియ్యక,
చిక్కదురా వారకాంత సిద్ధము సుమతీ 41

కొఱ గాని కొడుకు బుట్టిన
కొఱ గామియె కాదు, తండ్రి గుణములఁ జెఱచున్
చెఱకు తుద వెన్ను బుట్టిన
జెఱకున తీపెల్లఁ జెఱచు సిద్ధము సుమతీ 42

కోమలి విశ్వాసంబును,
బాములతోఁ జెలిమి, యన్య భామల వలపున్,
వేముల తియ్యదనంబును,
భూమీశుల నమ్మికలును బొంకుర సుమతీ 43

గడన గల మగని( జూచిన
నడుగడుగున మడుగు లిడుదు రతివలు దమలోఁ;
గడ నుడుగు మగని( జూచిన
నడ పీనుగు వచ్చె నంచు నగుదురు సుమతీ 44

చింతింపకు కడచిన పని,
కింతులు వలతురని నమ్మ కెంతయు మదిలో,
నంతఃపుర కాంతలతో
మంతనముల మాను మిదియె మతముర సుమతీ 45

చీమలు పెట్టిన
పుట్టలు పాముల కిరవైనయట్లు పామరుఁడు దగన్
హేమంబుఁ గూడ బెట్టిన
భూమీశుల పాలఁ జేరు భువిలో సుమతీ 46

చుట్టములు గాని వారలు
చుట్టములము నీకటంచు సొంపు దలిర్పన్
నెట్టుకొని యాశ్రయింతురు
గట్టిగ ద్రవ్యంబు గలుగఁ గదరా సుమతీ 47

చేతులకుఁ దొడవు దానము,
భూతలనాథులకుఁ దొడవు బొంకమి ధరలో,
నీతియె తొడవెవ్వారికి,
నాతికి మానంబు తొడవు నయముగ సుమతీ 48

తడ వోర్వక, యొడ లోర్వక,
కడు వేగం బడిచి పడిన గార్యం బగునే;
తడ వోర్చిన, నొడ లోర్చిన,
జెడిపోయిన కార్యమెల్లఁ జేకుఱు సుమతీ 49

తన కోపమె తన శత్రువు,
తన శాంతమె తనకు రక్ష, దయ చుట్టంబౌ
తన సంతోషమె స్వర్గము,
తన దు:ఖమె నరక మండ్రు తథ్యము సుమతీ 50

తన యూరి తపసి తపమును,
తన పుత్రుని విద్య పెంపు, దన సతి రూపున్,
దన పెరటి చెట్టు మందును,
మనసున వర్ణింపరెట్టి మనుజులు సుమతీ 51

తన కలిమి యింద్ర భోగము,
తన లేమియె స్వర్గలోక దారిద్ర్యంబున్,
దన చావు జల ప్రళయము,
తను వలచిన యదియె రంభ తథ్యము సుమతీ! 52

తన వారు లేని చోటను,
జనమించుక లేని చోట, జగడము చోటన్,
అనుమానమైన చోటను,
మనుజునకును నిలువఁ దగదు మహిలో సుమతీ 53

తమలము వేయని నోరును,
విమతులతో చెలిమి చేసి వెతబడు తెలివిన్,
గమలములు లేని కొలకును,
హిమధాముఁడు లేని రాత్రి హీనము సుమతీ 54

తలనుండు విషము ఫణికిని,
వెలయంగాఁ దోఁక నుండు వృశ్చికమునకున్,
తల తోఁక యనక యుండును
ఖలునకు నిలువెల్ల విషము గదరా సుమతీ 55

తలపొడుగు ధనము పోసిన
వెలయాలికిఁ నిజము లేదు వివరింపంగా
దలఁ దడివి బాసఁ జేసిన
వెలయాలిని నమ్మ రాదు వినరా సుమతీ 56

తల మాసిన, నొలు మాసిన,
వలువలు మాసినను బ్రాణ వల్లభునైనన్
గులకాంతలైన రోఁతురు
తిలకింపగ భూమిలోనఁ దిరముగ సుమతీ! 57

తాను భుజింపని యర్థము
మానవ పతిఁ జేరుఁ గొంత మఱి భూగతమౌఁ
గానల నీగలు గూర్చిన
తేనియ యొరుఁ జేరునట్లు తిరముగ సుమతీ! 58

దగ్గఱ కొండెము సెప్పెడు
ప్రెగ్గడ పలుకులకు రాజు ప్రియుఁడై మఱిఁ దా
నెగ్గు బ్రజ కాచరించుట
బొగ్గులకై కల్పతరువుఁ బొడుచుట సుమతీ! 59

ధనపతి సఖుడై యుండిన
నెనయంగా శివుఁడు భిక్షమెత్తఁగ వలసెన్;
దన వారి కెంత గలిగినఁ
దన భాగ్యమె తనకుఁ గాక తథ్యము సుమతీ! 60

ధీరులకుఁ జేయు మేలది
సారంబగు నారికేళ సలిలము భంగిన్
గౌరవమును మఱి మీఁదట
భూరి సుఖావహము నగును భువిలో సుమతీ! 61

నడువకుమీ తెరువొక్కట,
గుడువకుమీ శత్రు నింట గూరిమి తోడన్,
ముడువకుమీ పరధనముల,
నుడువకుమీ యొరుల మనసు నొవ్వగ సుమతీ 62

నమ్మకు సుంకరి, జూదరి,
నమ్మకు మొగసాల వాని, నటు వెలయాలిన్,
నమ్మకు మంగడి వానిని,
నమ్మకు మీ వామ హస్తు నవనిని సుమతీ! 63

*నయమునఁ బాలుం ద్రావరు,*
*భయముననను విషమ్ము నైన భక్షింతురుగా;*
*నయమెంత దోషకారియొ,*
*భయమే జూపంగ వలయు బాగుగ సుమతీ!* *64*

*నరపతులు మేరఁ దప్పినఁ,*
*దిరమొప్పఁగ విధవ యింటఁ దీర్పరి యైనన్,*
*గరణము వైదికుఁడైనను,*
*మరణాంతక మౌనుగాని మానదు సుమతీ!* *65*

*నవరస భావాలంకృత*
*కవితా గోష్టియును, మధుర గానంబును దా*
*నవివేకి కెంతఁ జెప్పిన*
*జెవిటికి శంఖూదినట్లు సిద్ధము సుమతీ!* *66*

*నవ్వకుమీ సభ లోపల;*
*నవ్వకుమీ తల్లి, దండ్రి, నాథుల తోడన్;*
*నవ్వకుమీ పరసతితో;*
*నవ్వకుమీ విప్రవరుల నయమిది సుమతీ* *67*

*నీరే ప్రాణాధారము*
*నోరే రసభరితమైన నుడువుల కెల్లన్*
*నారియె నరులకు రత్నము*
*చీరయె శృంగారమండ్రు సిద్ధము సుమతీ!* 68

*పగవల దెవ్వరి తోడను,*
*వగవంగా వలదు లేమి వచ్చిన పిదపన్,*
*దెగ నాడ వలదు సభలను*
*మగువకు మనసియ్య వలదు మహిలో సుమతీ* 69

*పతికడకు, దన్నుఁ గూరిన*
*సతికడకును, వేల్పు కడకు, సద్గురు కడకున్,*
*సుతుకడకు రిత్తచేతుల*
*మతిమంతులు చనరు నీతి మార్గము సుమతీ!* 70

*పనిచేయునెడల దాసియు,*
*ననుభవమున రంభ, మంత్రి యాలోచనలన్,*
*దనభుక్తి యెడలఁ దల్లియు,*
*నన్ఁ దన కులకాంత యుండు నగురా సుమతీ!* 71

పరనారీ సోదరుఁడై,
పరధనముల కాసపడక, పరులకు హితుఁడై,
పరులు దనుఁ బొగడ నెగడక,
పరు లలిగిన నలుగ నతఁడు పరముఁడు సుమతీ! 72

పరసతి కూటమి గోరకు,
పరధనముల కాసపడకుఁ, బరునెంచకుమీ,
సరిగాని గోష్టి సేయకు,
సిరిచెడి చుట్టంబు కడకు జేరకు సుమతీ 73

పరసతుల గోష్ఠి నుండిన
పురుషుఁడు గాంగేయుఁడైన భువి నింద పడున్,
బరసతి సుశీలయైనను
బరుసంగతి నున్న నింద పాలగు సుమతీ! 74

పరులకు నిష్టము సెప్పకు,
పొరుగిండ్లకుఁ బనులు లేక పోవకు మెపుడున్,
బరుఁ గదిసిన సతిఁ గవయకు,
మెఱిఁగియుఁ బిరుసైన హయము లెక్కకు సుమతీ 75

పర్వముల సతులఁ గవయకు,
ముర్వీశ్వరు కరుణ నమ్మి యుబ్బకు మదిలో,
గర్వింప నాలిఁ బెంపకు,
నిర్వహణము లేని చోట నిలువకు సుమతీ 76

పలు దోమి సేయు విడియము,
తలగడిగిన నాటి నిద్ర, తరుణులయెడలన్
బొల యలుక నాఁటి కూటమి
వెల యింతని చెప్పరాదు వినరా సుమతీ! 77

పాటెఱుఁగని పతి కొలువును,
గూటంబున కెఱుకపడని కోమలి రతియున్,
బేటెత్తఁ జేయు చెలిమియు,
నేటికి నెదురీఁదినట్టు లెన్నఁగ సుమతీ 78

పాలను గలసిన జలమును
పాల విధంబుననె యుండుఁ బరికింపంగా
పాల చవి జెఱచుఁ గావున
పాలసుఁడగు వాని పొందు వలదుర సుమతీ 79

పొలసునకైన యాపద
జాలింబడి తీర్పఁ దగదు సర్వజ్ఞునకున్
తేలగ్నిఁ బడఁగఁ బట్టిన
మేలెఱుఁగునె మీటుఁ గాక మేదిని సుమతీ 80

పిలువని పనులకుఁ బోవుటఁ,
గలయని సతి గతియు, రాజు గానని కొలువుం,
బిలువని పేరంటంబును,
వలువని చెలిమియును జేయ వలదుర సుమతీ 81

పుత్రోత్సాహము తండ్రికి
పుత్రుఁడు జన్మించినపుడె పుట్టదు, జనులా
పుత్రుని కనుఁగొనిఁ బొగడఁగ
పుత్రోత్సాహంబు నాడు పొందుర సుమతీ! 82

పురికిని ప్రాణము గోమటి,
వరికిని ప్రాణంబు నీరు వసుమతి లోనన్,
గరికిని ప్రాణము తొండము,
సిరికిని ప్రాణంబు మగువ సిద్ధము సుమతీ! 83

పులి పాలు దెచ్చి యిచ్చిన,
నలవడఁగా గుండె గోసి యఱచే నిడినన్,
దలపొడుగు ధనము బోసిన,
వెలయాలికి గూర్మి లేదు వినరా సుమతీ! 84

పెట్టిన దినముల లోపల
నట్టడవులనైన వచ్చు నానార్థములున్,
బెట్టని దినముల గనకపు
గట్టెక్కిన నేమి లేదు గదరా సుమతీ! 85

పొరుగున బగవాఁడుండిన,
నిరవొందక వ్రాతకాఁడె యేలిక యైనన్,
ధర గాఁపు కొండెమాడిన,
గరణాలకు బ్రదుకు లేదు గదరా సుమతీ! 86

బంగారు కుదువఁ బెట్టకు,
సంగరమునఁ బాఱిపోకు సరసుడవైతే,
నంగడి వెచ్చము వాడకు,
వెంగలితోఁ జెలిమి వలదు వినరా సుమతీ 87

బలవంతుఁడ నాకేమని
పలువురతో నిగ్రహించి పలుకుట మేలా;
బలవంత మైన సర్పము
చలి చీమల చేతఁ జిక్కి చావదె సుమతీ! 88

మదినొకని వలచి యుండఁగ
మదిచెడి యొక క్రూర విటుఁడు మానక తిరుగున్
బది చిలుక పిల్లి పట్టిన
జదువునె యాపంజరమున జగతిని సుమతీ 89

మండల పతి సముఖంబున
మెండైన ప్రధాని లేక మెలఁగుట యెల్లన్
గొండంత మదపు టేనుగు
తొండము లేకుండినట్లు దోఁచుర సుమతీ 90

మంత్రిగలవాని రాజ్యము
తంత్రము సెడకుండ నిలుచుఁ దఱచుగ ధరలో
మంత్రి విహీనుని రాజ్యము
జంత్రపుఁ గీలూడినట్లు జరుగదు సుమతీ! 91

మాటకుఁ బ్రాణము సత్యము,
కోటకుఁ బ్రాణంబు సుభట కోటి, ధరిత్రిన్
బోటికిఁ బ్రాణము మానము,
చీటికిఁ బ్రాణంబు వ్రాలు సిద్ధము సుమతీ 92

మానధనుఁ డాత్మ ధృతి చెడి
హీనుండగు వాని నాశ్రయించుట యెల్లన్
మానెడు జలముల లోపల
నేనుఁగు మెయి దాఁచినట్టు లెఱుఁగుము సుమతీ 93

మేలెంచని మాలిన్యుని,
మాలను, మొగసాలెవాని, మంగలి హితుగా
నేలిన నరపతి రాజ్యము
నేలఁ గలసి పోవుఁగాని నెగడదు సుమతీ 94

రాపొమ్మని పిలువని యా
భూపాలునిఁ గొల్వ భుక్తి ముక్తులు గలవే
దీపంబు లేని యింటను
జేపున కీళ్ళాడినట్లు సిద్ధము సుమతీ 95

రూపించి పలికి బొంకకు,
ప్రాపగు చుట్టంబు నెగ్గు పలుకకు మదిలోఁ,
గోపించు రాజుఁ గొల్వకు,
పాపపు దేశంబు సొఱకు పదిలము సుమతీ 96

లావిగలవాని కంటెను
భావింపఁగ నీతిపరుఁడు బలవంతుండౌ
గ్రానంబంత గజంబును
మావటివాఁడెక్కినట్లు మహిలో సుమతీ! 97

వఱదైన చేను దున్నకు,
కఱవైనను బంధుజనుల కడ కేగకుమీ,
పరులకు మర్మము చెప్పకు,
పిరికికి దళవాయి తనము పెట్టకు సుమతీ 98

వరిపంట లేని యూరును,
దొర యుండని యూరు, తోడు దొరకని తెరువున్,
ధరను పతి లేని గృహమును
నరయంగా రుద్రభూమి యనఁదగు సుమతీ 99

వినఁదగు నెవ్వరుఁ జెప్పిన
వినినంతనె వేగ పడక వివరింపఁ దగున్
కని కల్ల నిజము దెలిసిన
మనుజుఁడె పో నీతి పరుఁడు మహిలో సుమతీ 100

వీడెము సేయని నోరును,
జేడెల యధరామృతంబుఁ సేయని నోరున్,
పాడంగరాని నోరును
బూడిద కిరవైన పాడు బొందర సుమతీ 101

వెలయాలి వలనఁ గూరిమి
గలగదు, మఱి గలిగెనేని కడతేఱదుగా;
బలువురు నడచెడు తెరువున
మొలవదు పువ్వు, మొలిచెనేని పొదలదు సుమతీ 102

వెలయాలు చేయు బాసలు,
వెలయగ మొగసాల బొందు వెలమల చెలిమిన్,
గలలోనఁ గన్న కలిమియు
విలసితముగ నమ్మ రాదు వినరా సుమతీ 103

వేసరపు జాతి గానీ,
వీసముఁ దాఁ జేయనట్టి వీరిడి గానీ,
దాసి కొడుకైనఁ గానీ,
కాసులు గల వాఁడె రాజు గదరా సుమతీ! 104

శుభముల పొందని చదువును,
నభినయముగ రాగరసము నందని పాటల్,
గుభ గుభలు లేని కూటమి,
సభ మెచ్చని మాటలెల్లఁ జప్పన సుమతీ 105

సరసము విరసము కొఱకే,
పరిపూర్ణ సుఖంబు లధిక బాధల కొఱకే,
పెరుగుట విరుగుట కొఱకే,
ధర తగ్గుట హెచ్చు కొఱకె తథ్యము సుమతీ! 106

సిరి తా వచ్చిన వచ్చును
సలలితముగ నారికేళ సలిలము భంగిన్,
సిరి తాఁ బోయినఁ బోవును
కరి మ్రింగిన వెలగ పండు కరణిని సుమతీ! 107

స్త్రీల యెడ వాదులాడకు,
బాలురతోఁ జెలిమిచేసి భాషింపకుమీ,
మేలైన గుణము విడువకు,
మేలిన పతి నింద సేయ కెన్నఁడు సుమతీ 108

*Keywords: sumatI Satakamu, telugu lO sumatee Satakam, sumatee Satakamu, sumati Satakam, baddena viracita sumatI Sataka, telugu lO Satakamulu*